


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

గుంటూరు పల్నాడు

శనివారం 25 అక్టోబర్ 2025 - పేజీలు 8


## కల్తీ మద్యం లేకుండా చేయడమే..

ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జీవీ

# కూటమి ప్రభుత్వం లక్ష్యం..!



**వినుకొండ మేజర్ న్యూస్:** కల్తీ మద్యం లేకుండా చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, కల్తీ మద్యం ఘటనలను పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయడానికి ఎక్సైజ్ శాఖ సురక్ష యాప్‌ను తీసుకొచ్చిందనీ ప్రభుత్వ చీఫ్ విప్ వినుకొండ శాసనసభ్యులు అన్నారు. ఏ స్థాయిలో వ్యక్తులైనా కల్తీ మద్యాన్ని ప్రోత్సహించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి వినుకొండ మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఆర్.కె. మద్యం దుకాణాన్ని సందర్శించి యాప్ గురించి అవగాహన కల్పించారు. లైసెన్సుదారులు సురక్ష యాప్ ద్వారా మద్యం సీసాలను స్కాన్ చేసి విక్రయిస్తున్నారా..? యాప్‌లో వివరాలు నమోదవుతున్నాయా లేదా అని పరిశీలించారు. మద్యం కొనుగోలు చేసేందుకు వచ్చిన వినియోగదారులకు యాప్ ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

2లో

## ప్రాథమిక ఆర్థిక సూత్రాలే సుస్థిర

# స్వేచ్ఛకు పునాది

న్యూఢిల్లీలోని జేఎన్‌యూ ప్రొఫెసర్, ప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్త ప్రభాత్ పట్నాయక్

విజ్ఞాన్ యూనివర్సిటీలో ఘనంగా ప్రారంభమైన 'ఉద్భవ్యా' సిరీస్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో "ఉద్భవ్యా ఇగ్నైటింగ్ విజ్డమ్, ఇన్‌స్పైరింగ్ చేంజ్" అనే నూతన కార్యక్రమ సిరీస్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ అదర్ ఫారిన్ లాంగ్వేజెస్, మరియు ఆఫీస్ ఆఫ్ ది డీన్ స్టూడెంట్ అఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ముందుగా, "వాయిస్ ఆఫ్ విజ్డమ్: కన్వర్సేషన్స్ ఫర్ ఎ చేంజింగ్ వరల్డ్" అనే పేరుతో ప్రారంభమైన మొదటి చాప్టర్‌కి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సిరీస్‌లో భాగంగా వివిధ రంగాలకు చెందిన ప్రతిష్ఠాత్మక వ్యక్తులు తమ అనుభవాలు, ఆలోచనలు విద్యార్థులతో పంచుకునే అవకాశం లభించనుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) ప్రొఫెసర్, ప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్త ప్రభాత్ పట్నాయక్

వివరాలు 2లో...

# జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్యం

అన్ని విభాగాలను పటిష్టం చేస్తున్నాం వైద్య పరికరాలు, సిబ్బంది కొరతను అధిగమిస్తాం

జీజీహెచ్ సమీక్ష సమావేశంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి మహర్దశ పట్టిందని,గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వీ రమణతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రతి విభాగంలో వైద్య పరికరాలు ఎన్ని ఉన్నాయి? వాటి పనితీరు ఎలా ఉంది అనే అంశాలపై ఆరా తీశారు. సిబ్బంది కొరత గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఏ సమయంలోనైనా మెరుగైన వైద్య సాయం అందించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జీజీహెచ్ ని కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో వైద్య రంగాన్ని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో వివిధ ఆస్పత్రుల్లో నిరుపయోగంగా ఉన్న వైద్య పరికరాలను జీజీహెచ్ కు తీసుకొచ్చేందుకు చేసిన కృషి ఫలించిందని వెల్లడించారు. దీంతోపాటు ఆపరేషన్ థియేటర్లలో స్టాఫ్ నర్సులు, టెక్నీషియన్ల కొరత ఉన్నట్లు వైద్య అధికారులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. దీనిని వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి జిజిహెచ్ లో మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# నవంబర్‌లోపు పనులు పూర్తి చేయండి



**పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** నవంబర్ మాసం లోపు పంచాయ తీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ శాఖలో పలు అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ లోపు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కాలనీలలో తాగునీటి సమస్య రాకుండా యుద్ధ ప్రాతిపదిన పనులు చేపట్టాలని, ఆర్డబ్ల్యూఎస్ అధికారులను, పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. 15 ఫైనాన్స్ కమిషన్ నిధులు, జడ్పీ నిధుల నుండి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలో అన్ని మౌలిక వసతులు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాలలో జరిగే పలు అభివృద్ధి పనులు, సంబంధిత హెచ్ ఓ డి లు, జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ అభివృద్ధి పనులు పరిశీలించాలని ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ ఈ, సిబ్బంది, కాంట్రాక్టర్ లతో ప్రతిరోజు అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించుకుని పనుల నాణ్యతను పరిశీలించాలన్నారు. ఆర్డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో జరిగే త్రాగునీటి పైపు లైన్ మరమ్మత్తు పనులు, శానిటేషన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. వివిధ గ్రామాలలో త్రాగునీరు అందించడానికి పంప్ సెట్స్, పైప్ లైన్లు, విద్యుత్ సౌకర్యం, మీటరు మొదలైనవి అమర్చారా లేదా పరిశీలించాలని ఆదేశించారు. పనులకు సంబంధించిన బిల్లులు ఇచ్చేటప్పుడు సంబంధిత డిఈ చెక్ లిస్ట్ తో కూడిన బిల్లులతో జడ్పీ సీఈఓ కి బిల్లులు అందజేయాలని

వివరాలు 2లో...

# అనుమతులు లేకుండా వ్యాపారాలు సరికాదు

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** నగరపాలక సంస్థ పరిధిలో నిర్దేశిత అనుమతులు లేకుండా హోల్సేల్ కూరగాయల మార్కెట్ నిర్వహణ చట్టప్రకారం సరికాదని, అటువంటి వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకొని నిర్వహించుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి జాతీయ రహదారి సర్వీస్ రోడ్ లో అనధికారికంగా హోల్సేల్ కూరగాయల వ్యాపారం చేస్తున్న వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరపాలక సంస్థ పరిధిలో చట్టవ్యతిరేకంగా వ్యాపార నిర్వహణ చేసే స్థలంలో అవసరమైన ఎటువంటి అనుమతులు తీసుకోకుండా హోల్సేల్ కూరగాయల మార్కెట్ నిర్వహించడాన్ని అనుమతించబోమన్నారు. అలాగే జాతీయ రహదారి సర్వీస్ రోడ్ లో ప్రమాదకర పరిస్థితిలో ట్రాఫిక్ కి అంతరాయం కల్గిస్తూ చేయడం కూడా సరి కాదని సూచించారు. అలాగే అధికారికంగా బహిరంగ వేలంలో కొల్లిశారద మున్సిపల్ హోల్సేల్ మార్కెట్ లో షాప్ లు పొందిన వారి హక్కులను కాపాడడం, వారి సంక్షేమానికి కృషి చేయడం జిఎంసి భాధ్యత అని అన్నారు. కనుక అనధికార వ్యాపారాలు చేస్తున్న వారు జిఎంసికి సహకరించి, తాము వ్యాపారం చేసుకోవడానికి అనుకూలమైన స్థలంకు నిర్దేశిత అనుమతులు తీసుకొని, తగిని మౌలిక వసతులు ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేసుకోవాలని, అనుమతులు త్వరితగతిన ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఆర్ఓలు రవి కిరణ్ రెడ్డి, సాదిక్ బాష, ఆర్ఐలు ఖాజావలి, కాశయ్య, వ్యాపారులు సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే ఎక్కడుంటే అక్కడే గ్రీవెన్స్



నరసరావుపేట మేజర్ న్యూస్ : నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రజా సంక్షేమంలో వినూత్న రీతిలో ముందంజలో నడుస్తున్నారు. 'ఎక్కడుంటే అక్కడే గ్రీవెన్స్' అనే సూత్రంతో ఆయన రోజువారీ దినచర్యను రూపొందించుకుని, ప్రజల సమస్యల పరిష్కారంలో అపారమైన ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 5 గంటలకు తన నివాసంలోనే సహాయం, న్యాయం, సమస్యల పరిష్కారం కోసం బాధితులు ఎదురుచూస్తూ ఉంటారు. ఈ దృశ్యాన్ని గమనించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అక్కడే వారి ఫిర్యాదులను స్వీకరిస్తారు. ఈ గ్రీవెన్స్ కార్యక్రమం ఇక్కడ ప్రారంభమై, సాయంత్రం 11 గంటల వరకు కొనసాగుతూనే ఉంటుంది. స్వతహా డాక్టర్ అయినప్పటికీ, ప్రజా ప్రతినిధిగా తన బాధ్యతలను నిర్వహిస్తూ, వైద్య వృత్తిపై ఉన్న మక్కువతో ప్రతిరోజూ వీలైన సమయంలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ సమయంలో కూడా న్యాయం కోసం తన వద్దకు చేరుకునే బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తూ, ఒకేసారి ఒకవైపు వైద్యం చేస్తూ, మరోవైపు ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నారు. ఈ విధంగా ఆధునిక 'సవ్యసాచి' బిరుదును సొంతం చేసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రజల మధ్య అపారమైన ఆదరణను పొందుతున్నారు. శుక్రవారం ఉదయం తన సొంత హాస్పిటల్ అమూల్య నర్సింగ్ హోమ్‌లో వైద్య సేవలతో పాటు, ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఆయా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి, తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విధంగా ప్రజల సమస్యలకు త్వరిత పరిష్కారాలు కనుక్కోవడమే కాకుండా, వైద్య సేవల ద్వారా సమాజానికి మరింత సేవ చేస్తూ, నరసరావుపేట రాజకీయ, సామాజిక వర్గాల్లో ప్రత్యేక గుర్తింపును పొందుతున్నారు. ఈ కార్యక్రమాలు ప్రజలలో ఆశాకిరణాలను నింపుతూ, ఎమ్మెల్యేల పాత్రకు కొత్త ఆవిష్కరణలను చేర్చుతున్నాయి.

## పాల రైతు సంఘం జిల్లా మహాసభలు వాయిదా

తెనాలి, మేజర్ న్యూస్ : భారీ వర్షాల కారణంగా ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం జిల్లా మహాసభలను వాయిదా వేసినట్లు సంఘం నాయకులు ములకా శివసాంబిరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని ఐతానగర్ నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ కల్యాణ మండపంలో ఈ సభలు జరగాల్సి ఉంది. తిరిగి మహాసభలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామన్నారు.

## నేడు పట్టణంలో విద్యుత్ కోత

తెనాలి, మేజర్ న్యూస్ : విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డు, గాంధీచౌక్, శివాజీ చౌక్, కవిరాజు పార్కు రోడ్డు, నందులపేట, యడ్లపాటి వెంకట్రావు బజార్ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ కోత ఉంటుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బొరుగడ్డ అశోక్ కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కోత ఉంటుదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రత్తిపాడు, మేజర్ న్యూస్ : కూటమి ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకొని వెళ్ళి, మండలం లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి బలసాని కిరణ్ పెదనందిపాడు మండలం వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు షేక్ ఖాసీం పీరా కు సూచించారు. శుక్రవారం రెండవసారి మండల పార్టీ అధ్యక్షులు గా ఎన్నికయిన షేక్ ఖాసీం పీరా ను శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా బలసాని కిరణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రజలను మోసం చేస్తున్నదని వాటిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరి మీద ఉన్నదని తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు గొట్టిముక్కల వెంకట సుబ్బారావు, జంపని సంజీవరావు, దాసరి పద్మారావు, దివ్వి నాగయ్య, దివ్వి రాంబాబు, అల్లడి వెంకటేశ్వర్లు, కురేటి భూషయ్య తదితరులు ఉన్నారు.

# ఏపీ ఎక్సైజ్ సురక్ష' యాప్ ప్రారంభం



నరసరావుపేట మేజర్ న్యూస్: నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవింద బాబు తన కార్యాలయంలో శుక్రవారం 'ఏపీ ఎక్సైజ్ సురక్ష' మొబైల్ యాప్‌ను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖలో నకిలీ మద్యం గుర్తించడానికి ఈ యాప్‌ను ఎక్సైజ్ శాఖ అధికారులు అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు ప్రజల సురక్ష మరియు మద్య సంబంధిత నేరాలను అరికట్టడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం నాణ్యత లేని నకిలీ మద్యాన్ని విక్రయించి కోట్లు సంపాదించారని, ఎంతోమంది ప్రజల ప్రాణాలను బలి తీసుకున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తూ అన్ని రంగాల్లో జాగ్రత్తలు తీసుకుంటుందని అన్నారు. నకిలీ మద్యాన్ని నిరోధించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్ ని తీసుకొచ్చిందన్నారు. నకిలీ మద్యం వల్ల జరుగుతున్న హానులను దృష్టికి తీసుకుని, ఈ యాప్ ప్రారంభం చేయడం జరిగింది. ప్రజలు ఈ యాప్ ద్వారా మద్య బాటిల్స్‌పై క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, అసలైనదా, నకిలీదా అని తెలుసుకోవచ్చు. ఈ యాప్ ఆండ్రాయిడ్ మరియు ఐ ఓ ఎస్ ప్లాట్‌ఫారమ్‌లలో అందుబాటులో ఉందని, దీని ద్వారా మద్యం యొక్క మూలం, మాన్యుఫాక్చరింగ్ డేట్, ఎక్స్‌పైరీ వివరాలు తెలుస్తాయని వివరించారు. ఎక్సైజ్ సూపరిండెంట్ మణికంఠ మాట్లాడుతూ, "ఈ యాప్ ఆధారంగా ప్రజలు నకిలీ మద్యం గుర్తించి, సమస్యలు ఎదురైతే యాప్‌లోనే ఫిర్యాదు నమోదు చేయవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి" అని తెలిపారు. కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎక్సైజ్ సీఐ సోమయ్య, సిబ్బంది, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పోలియో దినోత్సవం



తెనాలి, మేజర్ న్యూస్ : ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో నల్లమోతు చెంచు రామనాయుడు మున్సిపల్ హై స్కూల్ లో చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలను ఉపాధ్యాయులు బెల్లంకొండ వెంకట్ పర్యవేక్షించారు. ముఖ్య అతిథులుగా అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణ చంద్, స్కూలు ప్రధాన ఉపాధ్యాయులు షేక్ కరిముల్లా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. జూనియర్, సీనియర్ విభాగాలలో ఈ పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, రోటరీ సభ్యులు, రోటరీ క్లబ్ కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, రోటరీ అమరావతి రీజన్ జాయింట్ సెక్రెటరీ గుత్తా వెంకటరత్నం, కొల్లి రాజేంద్రప్రసాద్, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని పెదరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలియో మీద వ్యాసరచన పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందచేశారు.

## పోలియో వ్యాధి పట్ల అవగాహన అవసరం



తెనాలి, మేజర్ న్యూస్ : పోలియో వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని నందులపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక పేర్కొన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక నందుల పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిని డాక్టర్ వేముల ప్రియాంక ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ చిన్న పిల్లల్లో వచ్చే శిశు పక్షవాతాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఐదేళ్ళ లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలను తప్పక వేయించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలతో పాటు, పోలియో చుక్కలను తప్పక వేయించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పోలియో చుక్కలను ప్రభుత్వ వైద్యశాలల్లో ఆరోగ్య కార్యకర్తలు,ఆశా కార్యకర్తల ద్వారా వ్యాక్సిన్ వేయడం జరుగుతున్నదని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా పోలియో నిర్మూలన అమలు చేస్తున్నదని చెప్పారు. పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మౌళి, ఫార్మసిస్ట్ అరగల శిరీష, స్టాఫ్ నర్స్ సునీత తదితరులు పాల్గొన్నారు.

## తెనాలిలో అర్ధరాత్రి పోలీసుల ఆకస్మిక తనిఖీలు



తెనాలి, మేజర్ న్యూస్ : త్రీ టౌన్ పరిధిలోని పలు లాడ్జ్ లు, వాహనాలు సీఐ సాంబశివరావు గురువారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. తన సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న లాడ్జ్ లలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి రికార్డులని పరిశీలించారు. బస చేస్తున్న వారి గుర్తింపు కార్డులు, వివరాలు సేకరిస్తున్నది లేనిది పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాల నిర్వహణపై పరిశీలన జరిపారు. లాడ్జ్ లలో దిగిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని లాడ్జ్ లలో బస చేసిన వారి వివరాలు సేకరించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పని సరిగా గుర్తింపు కార్డులు తీసుకోవాలని ఇకపై అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయన చెంచుపేటలో వాహనాలు తనిఖీ చేశారు. రాత్రి వేళలో అనవసరంగా బయట తిరిగితే చర్యలు తప్పవన్నారు. కొందరికి కౌన్సిలింగ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## వంటింటి వ్యర్థాలతో హోమ్ కంపోస్ట్ తయారు చేయవచ్చు



తెనాలి, మేజర్ న్యూస్ : మహిళలు వంటింటి వ్యర్థాలతో సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవచ్చునని మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. హోమ్ కంపోస్ట్ తయారీపై పట్టణంలోని 22, 25 వార్డుల్లోని అపార్ట్‌మెంట్లలో అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహార పదార్థాల వ్యర్థాలతో హోమ్ కంపోస్ట్ తయారీ విధానాన్ని వివరించారు. కమీషనర్ అప్పలనాయుడు మాట్లాడుతూ వంటింటిలో నుండి వ్యర్థాలను పారవేయకుండా హోమ్ కంపోస్ట్ తయారీకి వినియోగించుకోవాలని సూచించారు. వాటి వల్ల ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ మొవ్వ ఏసుబాబు, కౌన్సిలర్లు దుబాయ్ బాబు, తాడిబోయిన రామయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్, సచివాలయ సిబ్బంది, నగరదీపికలు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి పనులు తనిఖీ చేసిన కలెక్టర్



**గుంటూరు, మేజర్ న్యూస్:** జాతీయ రహదారి పనులను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా శుక్రవారం తనిఖీ చేశారు. తాడేపల్లి మండలం కొలనకొండ వద్ద , గుంటూరు తూర్పు మండల పరిధిలోని బుడంపాడు వద్ద జాతీయ రహదారి ఆరు లైన్ల విస్తరణ కోసం నూతనంగా నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జాతీయ రహదారికి సంబంధించి అభివృద్ధి , విస్తరణ పనులను, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదించిన ప్రాంతాలను పరిశీలించారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అధికారులను సమన్వయం చేసుకుంటూ జాతీయ రహదారుల అధికారులు డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో ఖాజా టోల్ ప్లాజా వద్ద వాహనదారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్ ను, మరుగుదొడ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కాకాని వద్ద గుంటూరు నుంచి వెళ్లే వాహనాలు జాతీయ రహదారి కి అప్రోచ్ రహదారి ఏర్పాటుకు పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులతో చర్చించి సూచనలు అందించారు. కాజా టోల్ ప్లాజా నుంచి రాజధాని ప్రాంతం మీదుగా గన్నవరం వరకు నేషనల్ హైవే అథారిటీస్ నిర్మిస్తున్న వెస్ట్ బైపాస్ పనులను జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పరిశీలించారు. కాజా టోల్ ప్లాజా వద్ద జరుగుతున్న బైపాస్ అప్రోచ్ పనులు, వెంకటపాలెం సమీపంలో కొండవీటి వాగు పై బైపాస్ వంతెన పనుల పురోగతిని జాతీయ రహదారుల అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. తాడేపల్లి సర్వీస్ రోడ్లపై, కుంచనపల్లి సెంటర్ వద్ద, కాజా టోల్ ప్లాజా వద్ద వర్షం నీరు నిల్వ ఉండకుండా నిర్మించాల్సిన డ్రెయిన్లు ప్రతిపాదనలను జాతీయ రహదారుల అధికారులు, ఎంటిఎంసి అధికారులు జిల్లా కలెక్టర్ కు మ్యాపుల ద్వారా వివరించారు. తాడేపల్లి, కాజా వద్ద జాతీయ రహదారి పక్కన నిర్మాణాలు పెరిగిపోవడంతో వర్షం నీరు రహదారిపై నిలిచి పోతుందని అధికారులు తెలిపారు. సర్వీస్ రోడ్డుకు ఇరువైపుల కాలువలు నిర్మించి ప్రత్యేక డ్రెయిన్లు ద్వారా నీటిని సమీపంలోని వాగుల్లోకి మళ్లించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పార్వతీశం, గుంటూరు రెవిన్యూ డివిజన్ అధికారి శ్రీనివాసులు, ఎంటీఎంసీ కమిషనర్ ఆలీమ్ భాష, తహసిల్దార్లు దినేష్ రాఘవేంద్ర, సీతారామయ్య, సుభాని, నేషనల్ హైవే అధికారులు, మున్సిపల్ ఇంజనీర్లు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

# జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన కలెక్టర్

**గుంటూరు, మేజర్ న్యూస్:** జ్యూడిషల్ అకాడమీ డైరెక్టర్ చింతలపూడి పురుషోత్తం కుమార్ ను జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరి మండలం కాజా వద్ద ఉన్న ఏపీ జ్యుడీషియల్ అకాడమీలో శుక్రవారం డైరెక్టర్ ను కలిసి పుష్ప గుచ్చాలు అందించారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, ఏంటీఎంసీ కమిషనర్ ఆలిం భాష పాల్గొన్నారు.

# సురక్ష పోస్టర్ ఆవిష్కరణ

**పెదకూరపాడు మేజర్ న్యూస్:** ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సురక్ష యాప్ ఆవిష్కరణ, సురక్ష వాల్ పోస్టర్ ఆవిష్కరణ,సురక్ష స్టిక్కర్ను ఎక్సైజ్ సీఐ వి శ్రీనివాసులు ఆవిష్కరించారు.శుక్రవారం స్థానిక వైన్ షాప్ వద్ద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్ వల్ల తీసుకున్న మద్యం ఎప్పుడు తయారయింది ఎక్కడ తయారైంది ఏ కంపెనీది తదితర అంశాలు స్కాన్ చేస్తే తెలుస్తాయన్నారు. దీనివల్ల కల్తీ మద్యాన్ని సులువుగా పట్టుకోవచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సై డి పీర్ హుస్సేన్, హెడ్ కానిస్టేబుల్ బి రవికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిఎంసి సిఎంఓహెచ్‌గా భాధ్యతలు తీసుకున్న డాక్టర్ పి. శాంతి కళ



**గుంటూరు మేజర్ న్యూస్:** కమిషనర్ పులి శ్రీనివాసులుని శుక్రవారం కలిసి జాయినింగ్ ఆర్డర్ తీసుకున్న ఆమెకు కమిషనర్ పలు సూచనలు అందజేస్తూ గుంటూరు నగరంలో పారిశుధ్య పనులను సమగ్రంగా పర్యవేక్షణ చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు.

# ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి



గుంటూరు జిల్లా మేజర్ న్యూస్: నగర శివారు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచి, ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, కచ్చా డ్రైన్లు ఏర్పాటు చేయాలని, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ కృష్ణబాబు కాలనీ, మునిసిపల్ ఎంప్లాయీస్ కాలనీ, పెద్ద పలకలూరు రోడ్, కంకరగుంట ఆర్యూబి తదితర ప్రాంతాలను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగర శివారు ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా కచ్చా కాల్వలు ఏర్పాటు చేయాలని, ఏఈల వారీగా ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం కంకరగుంట ఆర్యూబిని పరిశీలించి, ఇటీవల అదనపు మోటార్లను ఏర్పాటు చేయడం వలన వర్షం కురిసినా తక్కువ సమయంలోనే వాహనాల రాకపోకలకు వీలుగా నీటిని బెయిల్ అవుట్ చేయడం జరుగుతుందన్నారు. వర్షాలు మరో 2 రోజులు కురిసే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఆర్యూబి పరిసరాలను శుభ్రం చేసి, రెయిలింగ్ ఏర్పాటు, మొక్కలు నాటడంకు చర్యలు తీసుకోవాలని ఈఈని ఆదేశించారు. పర్యటనలో ఈఈలు కోటేశ్వరరావు, వేణు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# క్యాంపస్ ఇంటర్వ్యూలలో 30 మంది ఎంపిక

**యడ్లపాడు, మేజర్ న్యూస్:** మండలంలోని బోయపాలెం శివారు తుమ్మలపాలెం లోని శ్రీ మిట్టపల్లి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన వివిధ క్యాంపస్ ఇంటర్వ్యూల లో తమ కళాశాల నుంచి 30 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపాలకృష్ణ తెలిపారు. కళాశాలలో బి.టెక్ 4 వ సంవత్సరం చదువుతున్న సి ఎస్ ఈ, ఏ ఐ, ఈ సి ఈ గ్రూపులకు చెందిన విద్యార్థులకు టీవీఎస్ బ్రేక్ ఇండియా లిమిటెడ్ , టాప్ అకాడమీ లు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఇందులో టీవీఎస్ బ్రేక్ ఇండియా లిమిటెడ్ కి 12 మంది విద్యార్థులు మరియు టాప్ అకాడమీ కి 18 మంది ఎంపికైయ్యారు. వారికి వార్షిక వేతనం 3 నుండి 5 లక్షలు ఉంటుందని కంపెనీ ప్రతినిధులు తెలిపినట్లు ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను సెక్రటరీ ఎం.బి. వి. సత్యనారాయణ అభినందించారు. ఈ పోటీ ప్రపంచం



లో ఆధునిక సాంకేతికాలు అందిపుచ్చుకుంటే విజయ అవకాశాలు పుష్కలంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల ఏ ఓ శ్రీనివాసరావు, టీపీఓ కె . విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పనితీరుతో ప్రశంసలందుకున్న రవికుమార్ సేవలు

# ఉద్యోగులందరికి ఆదర్శం



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ శాఖలలో అసిస్టెంట్ కమిషనర్ గా విలువైన సేవలందించిన ఐ.ఆర్.ఎస్ అధికారి బి. రవి కుమార్, విధి నిర్వహణలో ఉద్యోగులందరికి ఆదర్శంగా నిలిచారని సెంట్రల్ జీఎస్టి కమిషనర్ సుజిత్ మల్లిక్ కొనియాడారు. శుక్రవారం ఉదయం లక్ష్మీపురంలోని ఎల్. వి. ఆర్ క్లబ్ ఫంక్షన్ హాలులో జరిగిన రవికుమార్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి కమిషనర్ ముఖ్య అతిధి గా పాల్గొని ప్రసంగించారు. సుజిత్ మల్లిక్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావం, నిరంతర శ్రమ, సామర్థ్యంతో రవి కుమార్ పనిచేసి, ఉత్తమ అధికారిగా మంచి గుర్తింపు పొందారన్నారు. ప్రతి ఉద్యోగి క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించుకొని ఆశయసాధన తో పనిచేయాలని సూచించారు. జీఎస్టి అడిషనల్ కమిషనర్ బి. లక్ష్మినారాయణ మాట్లాడుతూ.. కృషి, పట్టుదలే సోపానాలుగా రవి కుమార్ మరింతగా ఎదిగారని ప్రశంసించారు. జీఎస్టీ జాయింట్ కమిషనర్ దేవ్ కుమార్ మాట్లాడుతూ..విధుల పట్ల విధేయత కలిగిన వారు తప్పక రాణిస్తారన్నారు. పదవీ విరమణ చేయనున్న అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ..కమిషనర్ అందించిన ప్రోత్సహం, ఉద్యోగులందరి సహకారం తోనే తాను అమూల్యమైన సేవలను అందించగలిగానన్నారు. ఉద్యోగ అనుభవాలు వివరించి, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కమిషనర్ తదితర ఉన్నతధికారులు మరియు ఉద్యోగులు రవికుమార్ ను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందచేసారు. కార్యక్రమంలో గజిటెడ్ అధికారుల సంఘ నాయకులు ఎం.నాగరాజు, కె. యుగంధర్, బి. నవీన్ రాజు మినిస్టీరియల్ సంఘ నేతలు శాఖమూరి శ్రీనివాస్, బిల్లా ప్రశాంత్ కుమార్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు టి. వివేకానంద, గద్దె తిలక్, పి.వి.సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి.కోటేశ్వరరావు, ఎన్. ఎస్. నగేష్ బాబు, కె. సాంబ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం

# కలిగిస్తే కఠిన చర్యలు

**సత్తెనపల్లి డీస్పీ హనుమంతరావు.**

**ముప్పాళ్ళ మండలం మాదల గ్రామంలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్**

**కర్రలు, బడిసెలు,గొడ్డళ్ళు, సీసాలు స్వాధీనం**

**సరైన పత్రాలు లేని 15ద్విచక్ర వాహనాలు సీజ్**

**సత్తెనపల్లి, మేజర్ న్యూస్** : గ్రామంలో కొన్ని రోజులుగా రెండు వర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి.ఈ నేపథ్యంలోనే 110మంది పోలీసులతో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించాము. గ్రామంలోని ప్రతి ఇంటిని సర్చ్ చేసాం.భారీగా మారణాయుధాలు బయటపడ్డాయి. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మని సత్తెనపల్లి డీస్పీ హనుమంతరావు అన్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు ముప్పాళ్ళ మండలం, మాదల గ్రామం లో శాంతి భద్రతల పరిరక్షణ చర్యలలో భాగంగా సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, సామాన్య ప్రజలకు ఇబ్బందులకు గురి చేసే వారిని గుర్తించి "ప్రజలకు మేమున్నాము" అనే భరోసా కల్పిస్తూ కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్డెన్ %డ% సెర్చ్ కార్యక్రమం నందు రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్, పాత కేసుల లోని నిందితులపై ప్రత్యేక నిఘా... ఇళ్లు, పరిసర ప్రాంతాలలో విస్తృత తనిఖీలు చేశారు. ఈ తనిఖీ లలో గ్రామంలో సరైన పత్రాలు లేని 46 ద్విచక్ర వాహనాలు, కర్రలు, బరిసెలు, ఖాళీ సీసాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఫుడ్ పెట్రోలింగ్ చేస్తూ గ్రామస్తులతో సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పాత కేసుల నిందితుల తో సమావేశమై పాత పంథా కొనసాగించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. గ్రామంలో రెండు వర్గాల మధ్య ఉన్నటువంటి విభేదాల కారణంగా గొడవలు సృష్టిస్తే సహించేది లేదని, వారి మీద కఠినమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి టౌన్ సిఐ ఎన్.నాగమల్లేశ్వర రావు, సత్తెనపల్లి రూరల్ పి.కిరణ్, ఎస్సైలు, 100 సిబ్బంది పాల్గొన్నారు.



# జగన్ కబుర్లు మానుకో


## చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



**వినుకొండ మేజర్ న్యూస్:** పులివెందల ఎమ్మెల్యే వైఎస్ జగన్ 420 కబుర్లు మానుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హితవు పలికారు. గాలి పలుకులు, అబద్ధాలు, అర్ధ సత్యాలను పోగేసి వండివార్చటంలో జగన్‌రెడ్డికి గోబెల్స్‌ను మించి పోయారన్నారు. రాష్ట్రంలో ఏ చిన్న ఘటన జరిగినా దాన్ని రాద్ధాంతం చేస్తూ ప్రజలను గందరగోళం చేయ డమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు. వినుకొండలోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలకృష్ణపై జగన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మండిపడ్డారు. వైసీపీ పాలనలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు సభలో ఎంత అగౌరవంగా మాట్లాడారో ప్రజలంతా చూశారన్నారు. ప్రజలంతా మెచ్చుకునే విధంగా గౌరవప్రదమైన సభగా ప్రస్తుతం అసెంబ్లీ నడుస్తుందన్నారు. క్రమశిక్షణకు మారుపేరు, అసెంబ్లీని దేవాలయం లాగా భావించే హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై జగన్‌రెడ్డి అవమానకరంగా, అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటని, ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. బాలకృష్ణ అసెంబ్లీకి ఎప్పుడొచ్చినా సభ్యులందరితో చాలా స్నేహపూర్వకంగా, హుందాగా ఉంటారన్నారు. అలాంటి వ్యక్తిపై కావాలనే దురుద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అసెంబ్లీ అంటే బాలకృష్ణకు అపార గౌరవం ఉందని, అలాగే ఎన్డీఏ కూటమి సభ్యులు కూడా దేవాలయంలా భావిస్తా రన్నారు. స్పీకర్‌పై కూడా ఇష్టానుసారం మాట్లాడటం తగదని, ఇది సభా నియ మావళిని ఉల్లంఘించినట్లేనని చెప్పారు. బాలకృష్ణ గురించి అసత్య ఆరోపణలు చేసిందుకు గాను జగన్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తు న్నామన్నారు. గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి 2019లోనే అప్పుడు సీఎం గా ఉన్న చంద్రబాబు శంకుస్థాపన చేశారని, విశాఖకు గూగుల్ ఎవరి హయాంలో వచ్చిందో గూగుల్‌ను అడిగినా చెబుతుందని జగన్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. గూగుల్ డేటా సెంటర్ రావడానికి తానే కారణం అంటూ ఎవరికో పుట్టిన బిడ్డకి పేరు పెట్టుకుని ముద్దాడినట్టు జగన్ రెడ్డి తాపత్రయపడుతూ మరుగుజ్జు రాజకీయాలు చేస్తున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేయని పనులకు జగన్‌రెడ్డి క్రెడిట్ తీసుకోవడం చాలా సిగ్గుచేటని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ రూ.లక్షా 30 వేల కోట్ల పెట్టుబడులతో గూగుల్ డేటా సెంటర్ తీసుకొచ్చారని, వారిని అభినందించాల్సింది పోయి ఈ విధంగా దుర్మార్గంగా మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. 2019లో సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేసిన దాన్నే మళ్లీ 2023లో శంకుస్థాపన చేయడానికి సిద్దులేదా అని ప్రశ్నించారు. డేటా సెంటర్ నిర్మాణాన్ని ఎందుకు ముందుకు తీసుకెళ్లలేకపోయారో జగన్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. ఒప్పందం జరిగిన దాన్ని కూడా క్షేత్రస్థాయిలో అమల్లోకి తీసుకురాలేకపోయిన అసమర్థులు జగన్‌రెడ్డి, ఆ పార్టీ నేతలు అని పేర్కొన్నారు. గూగుల్ డేటా సెంటర్‌ను వైసీపీ పాలనలో తెచ్చామని జగన్‌రెడ్డి చెప్పే మాటలను కనీసం వారి కుటుంబసభ్యులైనా నమ్ముతారా అని ప్రశ్నించారు. అసత్య ప్రచారాలు చేస్తున్న జగన్‌రెడ్డి ఇప్పటికైనా మారాలని, ప్రజలు విప్లవాత్మమైన తీర్పు ఇచ్చారని, మాట్లాడితే సిగ్గుండా లంటావు.. సిగ్గు పడాల్సిందెవరో ప్రజలు ఏడాదిన్నర క్రితమే చెప్పార న్నారు. విశాఖకు మంత్రి లోకేష్ ఇంకా పెద్దఎత్తున ఐటీ పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకొస్తారని, ఐటీ హబ్‌గా విశాఖను తీర్చి దిద్దుతారన్నారు. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని, ఇప్పటికే రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, దీనివల్ల 10 లక్షలకుపైగా ఉద్యోగాలు రాబోతున్నాయన్నారు.

### ట్రావెల్స్ బస్సు ప్రమాదంపై చీఫ్ విప్ జీవీ దిగ్భ్రాంతి

మృతుల కుటుంబాలకు జీవీ ఆంజనేయులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళు న్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కర్నూలు సమీపంలో అగ్నికి ఆహుతి కావడం చాలా బాధాకరమని, అగ్నిప్రమాదంలో చాలామంది చనిపోవడం బాధకలిగించిందన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే చాలా దిగ్భ్రాంతికి గురయ్యానని, సంఘటన హృదయ విదారకంగా ఉందని, కొంతమంది నిద్రలోనే సజీవదహనమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటన జరగడం చాలా దురదృష్టకరమని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని, భగవంతుడు ఆ కుటుంబాలకు మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.



# రోడ్ల నిర్మాణానికి సహకరించండి

**నందివెలుగు రోడ్డులో చలవట్టు నిర్మాణం అత్యవసరం**

**రోడ్లు, భవనాల శాఖ కమిషనర్ కు ఎమ్మెల్యే నసీర్ వినతి**

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** తూర్పు నియోజక వర్గంలో రోడ్ల అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని రోడ్లు, భవనాల శాఖ కమిషనర్ కృష్ణబాబును గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కోరారు. శు క్రవారం మంగళగిరి సెక్రటేరియట్లో రోడ్లు, భవనాల శాఖ కమిషనర్ కృష్ణబాబుకు ఎమ్మెల్యే నసీర్ వినతిపత్రం అందజేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కల్వర్టులు, రోడ్ల నిర్మాణాలపై నివేదిక సిద్ధం చేశామని వివరించారు. వీటికి తగిన అనుమతులు ఇచ్చి సహకరించాలని కోరారు. నందివెలుగు వెళ్లే రోడ్డులోని జాకీర్ హుస్సేన్ నగర్ వద్ద కల్వర్టు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని విన్నవించారు. భారీ వర్షాల సమయంలో ఈ కల్వర్టు వద్ద ముంపు కారణంగా ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మణిపురం బ్రిడ్జి మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే నసీర్ వినతి మేరకు రోడ్లు, భవనాల శాఖ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# నాటు ఆవుల పెంపకంతో స్వయం ఉపాధి



**తెనాలి, మేజర్ న్యూస్ :** దేశవాళీ నాటు ఆవులు పెంచుతూ తల్లీ కుమారుడు నెలకి రూ 50 వేలు ఆర్జిసున్నారు. రామలింగేశ్వరపేట లో నివసిస్తున్న యక్కల కళ్యాణి, ఆమె కుమారుడు దయానంద్ లు ఆవుల పెంపకం వృత్తి గా చేపట్టారు. 10 ఆవులు 4దూడల నుంచి వచ్చే పాలు, పేడ, మూత్రం నుంచి ఈ ఆదాయం పొంది స్వయం ఉపాధి సా దిస్తున్నారు. పాల నుంచి నెయ్యి, పెరుగు ఉత్పత్తి చేయ టం, పేడ నుంచి పిడకలు, మూత్రాన్ని వేడి చేసి ఆవిరిని పట్టి వైద్య అవసరాలకు విక్రయి స్తున్నారు. దేశ వాళీ ఆవు నెయ్యి మార్కెట్ లో కిలో రూ.4 వేల ధర పలుకుతోంది. నాణ్యమైన నెయ్యి కి డిమాండ్ బాగా ఉంది. తెనాలిలో వార్డు పర్యటన లో రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ గోశాల చూసి ఉత్పత్తుల నాణ్యత అడిగి తెల్సుకున్నారు. నిర్వాహకులను ఆయన అభినందించారు. నెయ్యి కొనుగోలు చేసి వారిని అభినందించారు. ప్రభత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి పొందడం పలువురికి స్ఫూర్తి అందించడం పట్ల మంత్రి మనోహర్ హర్షం వ్యక్తం చేశారు.

# అన్న క్యాంటీన్లను పరిశీలించిన కమిషనర్ పులి శ్రీనివాసులు



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** నగరపాలక సంస్థ పరిధిలోని అన్నక్యాంటీన్లలో పరిశుభ్రత పాటించాలని, పర్యవేక్షణ కోసం విధులు కేటాయించిన వార్డ్ సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షణ చేసి, లోపాలు గుర్తిస్తే నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మిర్చి యార్డ్ లోని అన్న క్యాంటీన్ ని కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ, అన్న క్యాంటీన్ల పరిసరాల్లో ఆహారం తీసుకునే వారికి ఇబ్బంది లేకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ప్రతి రోజు ప్రభుత్వ నిర్దేశిత సమయంలో ఆహారం అందుబాటులో ఉండేలా, మౌలిక వసతులు కల్పించేలా పర్యవేక్షణ కోసం వార్డ్ సచివాలయ కార్యదర్శులను కేటాయించామని, వారు నిర్దేశిత సమయంలో క్యాంటీన్లో ఉండాలన్నారు. క్యాంటీన్ పరిసరాల పరిశు భ్రంకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రధానంగా త్రాగునీరు, పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# విద్యార్థులకు ఏ ఐ హ్యాకథాన్ గురించి శిక్షణ



ప్రత్తిపాడు మేజర్ న్యూస్: ప్రతి విద్యార్థిని ఏ ఐ హ్యాకథాన్గురించి పూర్తిగా నేర్చుకుంటే భవిష్యత్తులో చాలా ఉపయోగాలు ఉంటాయనిమలినేని సంస్థల ఛైర్మన్ డా. పెరుమాళ్లు అన్నారు. శుక్రవారం మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో హ్యాకథాన్ శిక్షణ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న పెరుమాళ్ళు మాట్లాడుతూ సీ ఎస్ ఈ 3వ సంవత్సరం విద్యార్థీనులలకు మేక్ స్కిల్డ్ ఆధ్వర్యంలో 36 గంటల హ్యాకథాన్‌ను నిర్వహించారు. ఈ ఇంటెన్సివ్ హాకథాన్ లో 255 విద్యార్థినులు పాల్గొని ఏఐ రంగంలో సృజనాత్మక సమస్యలను పరిష్కరించేందుకు కృషి జరుగుతుందని తెలిపారు. 36 గంటలపాటు, టెక్నికల్ సవాళ్లు, కోడింగ్, మోడల్ డెవలప్‌మెంట్, ప్రాజెక్ట్ ప్రెజెంటేషన్స్ వంటి కార్యక్రమాలు గురించి విద్యార్థినిలకు పూర్తి స్థాయిలో శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. ఈ నేటి టెక్నాలజీ యుగంలో ఏజెంటిక్ ఏ ఐ మరియు జనరేటివ్ ఏ ఐ వంటి సాంకేతిక పరిజ్ఞానాలు భవిష్యత్తును మలుపు తిప్పగలవు. విద్యార్థినులు ప్రాజెక్టులను కేవలం ల్యాబ్ వరకు పరిమితం చేయకుండా, వాటిని రియల్ టైమ్ ఎన్విరాన్మెంట్‌లో అమలు చేయగలిగేలా నేర్చుకోవాలి. అందుకోసం కళాశాలలో ఏ ఐ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం, వీటి ద్వారా విద్యార్థినులు తమ సృజనాత్మక ఆలోచనలను ప్రాజెక్టులుగా మార్చి, సమాజంలోని సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను కనుగొనగలరు" అని అన్నారు.". కళాశాల డైరెక్టర్ డా. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ "ఇలాంటి హాకథాన్‌లు విద్యార్థినుల సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు, టీం వర్క్ పెంపొందించడంలో కీలకంగా ఉంటాయి. ఆధునిక ఏ ఐ రంగంలో ప్రాక్టికల్ అనుభవం కోసం ఇది గొప్ప అవకాశం"చేస్తాయన్నారు. ఈ ప్రోగ్రాం లో జ్యూరీ సభ్యులుగా "ఆంధ్రా స్టార్టప్స్ సీనియర్ కన్సల్టెంట్ నంద కిషోర్ రావు , హోఫ్ బ్రెయిన్ సీఈవో బన్నీ నాయుడు మరియు నిగాటెక్ సీఈవో ఎం. పవన్ విజయ్ కుమార్ పాల్గొని మొత్తం ప్రాజెక్టులను పరిశీలించి 10 జట్టులను విజేతలుగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.జె.అప్పారావుగారు, సీ ఎస్ ఈ హెచ్ ఓ డి డా.జి.రామస్వామి మరియు ఇతర విభాగాధిపతులు , మేక్ స్కిల్డ్ సీఈవో మధు పర్వతనేని, మేక్ స్కిల్డ్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొని విద్యార్థినులను అభినందించారు.

# పత్తి వరి పొలాల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి: ఏవో వెంకట నరసయ్య



**రాజుపాలెం మేజర్ న్యూస్:** మండలంలోని రెడ్డిగూడెం మరియు రాజుపాలెం గ్రామాలలో క్షేత్ర సందర్శనలో భాగంగా మండల వ్యవసాయ అధికారి, పి వెంకట నరసయ్య మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో రైతులు పత్తి మరియు వరి పైరులలో సరైన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా పత్తి పంటలో ప్రస్తుతం పూత, కాయ ఉందని పొలంలో నీరు నిల్వ ఉన్నట్లయితే వీలైనంత త్వరగా నీటిని బయటకు పంపించే విధంగా ఏర్పాటు చేసుకోవాలి. ఒక ఎకరాకు 20 - 25 కిలోల యూరియా మరియు 10 -15 కిలోల పొటాష్ ఎరువులను అందించాలి. నీరు పోయే అవకాశం లేనప్పుడు 2% పొటాషియం నైట్రేట్ లేదా 2% మెగ్నీషియం సల్ఫేట్ ను 5-7 రోజుల వ్యవధిలో రెండుసార్లు అందించాలని తెలిపారు. దీని ద్వారా పందుఆకు తెగులును కూడా సమర్థవంతంగా అదుపులో ఉంచవచ్చును. అదేవిధంగా బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ ఎకరాకు 600గ్రా మరియు స్ట్రెప్టోసైక్లిన్ 20గ్రా చొప్పున పిచికారీ చేయాలి.వరి పైరు దుబ్బు, సుంకు దశలో ఉన్నందున పొలంలో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలి. బ్యాక్టీరియా ఎండు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున 0.2గ్రా ప్లాంటోమైసిన్ మందును లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. కాండంకుళ్ళు నివారణకు 2గ్రా కార్బన్డిజం మరియు మంకోజెబ్ అనే శిలీంద్ర నాసిని మందును గాని లేదా ఒక లీటర్ నీటికి 1మి.లీ వాలిడామైసిన్ కానీ పిచికారి చేయాలని తెలిపారు. బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులును గమనించినట్లయితే నత్రజని ఎరువులను నిలుపుదల చేసి పొటాషియం ఎకరానికి 15-20 కిలోలు చొప్పున వేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో, గ్రామ వ్యవసాయ సహాయకులు ఉమామహేశ్వర రెడ్డి మరియు గలిబిషా మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



**గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్ :** జిల్లాలోని పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యత ఇస్తున్నట్లు గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది వినతులు మరియు సమస్యల పరిష్కారానికై **"పోలీస్ స్టాఫ్ గ్రీవెన్స్ డే"** కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ సిబ్బంది నుండి వివిధ వినతులు, ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొత్తం 8 మంది పోలీస్ సిబ్బంది తమ బదిలీలు, సర్వీసు సంబంధిత సమస్యల పరిష్కారానికి వినతి పత్రాలు సమర్పించగా, వాటిపై ఎస్పీ సానుకూలంగా స్పందించి, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి వినతుల పరిష్కారం పట్ల పోలీస్ శాఖకు అత్యంత ప్రాధాన్యత ఉందని ఎస్పీ తెలిపారు. సిబ్బంది తమ సమస్యలను నేరుగా ఎస్పీ కార్యాలయానికి వచ్చి తెలియజేయవచ్చని కూడా ఆయన పేర్కొన్నారు. విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి ఉత్తమమైన పోలీస్ సేవలు అందించాలని, ప్రజల్లో భరోసా కల్పించే విధంగా కృషి చేయాలని ఎస్పీ ఈ సందర్భంగా సూచించారు.

# కార్మికులు రక్షణ పరికరాలు తప్పనిసరిగా ధరించాలి




కార్యక్రమంలో ఈఈ వేణుగోపాల్, డిఈఈ సతీష్, ఏఈ మధు పాల్గొన్నారు.

**గుంటూరు మేజర్ న్యూస్ :** జీఎంసి విద్యుత్ విభాగంలో విధులు నిర్వహించే కార్మికులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, వారికి జీఎంసి నుండి అందించిన రక్షణ పరికరాలను తప్పనిసరిగా ధరించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం నగరపాలక సంస్థ పరిధిలోని 67 మంది విద్యుత్ కార్మికులకు కౌన్సిల్ సమావేశ మందిరం వద్ద రక్షణ పరికరాలను మేయర్, కమిషనర్ అందించారు. వారు మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహించే కార్మికుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇప్పటికే కార్మికులకు ఇన్సూరెన్స్ కల్పించడం, ప్రతి నెల 3 శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్ విభాగంలో విధులు నిర్వహించే వారికి కూడా కటింగ్ ప్లేయర్, స్క్రూ డ్రైవర్, సుత్తి, షూస్, రెయిన్ కోట్, సేఫ్టీ బెల్ట్, ఫ్లాట్ రెంచీలు, రింగు రెంచీలు, ఎల్లంకి సెట్, ట్రీ కట్టర్, టార్చ్ లైట్, నిచ్చెనలు, హ్యాండ్ గ్లౌజులు, కటింగ్ ప్లేయర్, ట్రైప్ సైడ్ కట్టర్స్ తో కూడిన కిట్లను అందించామని తెలిపారు.

# బ్యూటీ పార్లర్ ను సందర్శించిన జడ్పీహెచ్ఎస్ విద్యార్థునులు




**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** దుగ్గిరాల గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల బాలికలు పాఠశాల హెచ్.ఎం.ఎస్.శోభా దేవి ఆధ్వర్యంలో గ్రామములో ఇండస్ట్రియల్ విజిట్ను నిర్వహించారు. ఒకేషనల్ ట్రైనర్ బేబీ శాలిని, వ్యాయామ ఉపాధ్యాయిని అంతో నమ్మి ల నేతృత్వంలో బాలికలు. లావిష్ బ్యూటీ పార్లర్ ను సందర్శించారు. ఒకేషనల్ బ్యూటీ అవేర్నెస్ ను కల్పించారు. విద్యార్థునులు ఉన్నత చదువులు చదివి, స్థిరపడకపోయినా స్వతహాగా స్థిరపడేందుకు. దూర ప్రాంతాలకు తరలి వెళ్లకుండా దగ్గరలో ఉన్న లావిష్ బ్యూటీ పార్లర్ బాలికలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని లావిష్ బ్యూటీ పార్లర్ ను ఇండస్ట్రియల్ విజిట్ లో భాగంగా సందర్శించడం ఎంతగానో ఉపయోగ పడుతుందనేది బాలికల నోటా వినవొస్తుంది.

# నకరికల్లు మండలంలో పొలాలు పరిశీలించిన వ్యవసాయ అధికారులు



**నకరికల్లు మేజర్ న్యూస్ :** నకరికల్లు మండలంలోని గుండ్లపల్లి, నరసింగపాడు, నకరికల్లు గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి శ్రీ కే.దేవదాసు వరి పంట పొలాలను పరిశీలించడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం వరి చిరుపట్ట మరియు గింజ పాలు పోసుకుని దశలో ఉన్నది. తుఫాన్ నేపథ్యంలో వర్షాలు తగ్గేంత వరకు చిరు పొట్ట దశలో ఉన్నటువంటి వరి పొలాలకు ఎకరాకు 20 కేజీల యూరియాను పై పాటుగా చల్లటాన్ని వాయిదా వేయవలెనని రైతులకు తెలియపరిచారు. ప్రధానంగా ఆకు ఎండు తెగులు లక్షణాలు కనిపిస్తున్నాయి. దీని నివారణకు గాను రైతులు ఎకరానికి 20 కేజీల మ్యూరేటా ఆఫ్ పొటాష్ ఎరువులు వరి పంటలో పైపాటుగా చల్లుకోవాలని, పొలంలో ఉన్న నీటిని మురుగు కాలవల ద్వారా బయటికి పంపించి మరల రెండు రోజుల తర్వాత మంచి నీటిని పెట్టుకోవాలని తెలియపరిచారు. యూరియా ఎరువుల వాడకం వాయిదా వేసుకోవాలని రైతులకు తెలియపరిచారు. మొదట్లో కాపర్ హైడ్రాక్సైడ్ 53.8% 400 గ్రాములు మరియు ప్లాంటోమైసిన్ 200 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరా వరి పంటపై పిచికారి చేయాలని రైతులకు తెలియపరిచారు. అలాగే వరిలో ఆకు చుట్టుపురుగు కనిపిస్తుంది. దీని నివారణకు గాను గాను కాపర్ ఆక్సీ క్లోరైడ్ ఎకరాకు 400 గ్రాములను లేదా క్లోరాంతర నీల్ ఫ్లోర్ 60 మీ.లీ. లేదా ఇండాక్స్ కార్బు 150 మీ.లీ. ను 200 నీటిలో కలిపి వరి పంటపై పిచికారి చేయాలని రైతులకు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు యు. ప్రియదర్శిని, సువిలా, ముస్తక్, వై ప్రభాకర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

# రైతుల ఆదాయం - భూమి ఆరోగ్యం

## ప్రజల ఆరోగ్యం లక్ష్యంగా ప్రకృతి వ్యవసాయం



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** శుక్రవారం పట్టణంలోని బృందావన మీటింగ్ హాల్లో రైతు శిక్షకులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమం రెండో రోజు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం రైతులు అనుసరిస్తున్న రసాయనాధారిత వ్యవసాయ పద్ధతుల వల్ల భూమి సారవంతత తగ్గిపోతోందని, రైతులు అప్పుల ఊబిలో ఇరుక్కుపోతున్నారని, వాతావరణ మార్పులు కూడా పెను ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ప్రతి రైతు ప్రధాన పంటతో పాటు కనీసం నాలుగు రకాల అంతర పంటలు వేసుకోవాలని, దీని వలన రైతులకు నిరంతర ఆదాయం లభిస్తుందని, చెడపీడల ఉధృతి తగ్గి, భూమి సారవంతత పెరుగుతుందని వివరించారు నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్లో భాగంగా ప్రతి రైతు శిక్షకుడు తన పరిధిలో కనీసం 60 మంది రైతులను 365 రోజులు అంతర పంటలతో ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించేలా చూడాలని సూచించారు జిల్లా అదనపు ప్రాజెక్ట్ మేనేజర్ ప్రేమ్ రాజు మాట్లాడుతూ, ప్రతి గ్రామ సంఘ పరిధిలోని స్వయం సహాయక సంఘ రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే భూమిలేని నిరుపేద కుటుంబాలు పెరటి తోటలు పెంచుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, దీని వలన వారు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా సిబ్బంది సైదయ్య, అప్పలరాజు, మేరీ, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాల వలన పనులు లేక అవస్థలు పడుతున్న పేద ప్రజలు



**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల చెన్నకేశవ నగర్ లోని కాలనీవాసులకు పనులు లేక కుటుంబ పోషణ లేక పలు ఇబ్బందులకు గురవుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, జి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం గ్రామంలోని చెన్నకేశవ కాలనీలో పరిశీలించగా ఇళ్లలోకి వర్షపు నీరు చేరి వంట చేసుకునేందుకు అవకాశం లేకుండా బయటికి రాలేని పరిస్థితి ఉందని అన్నారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చినప్పటికీ, ఇల్లు నిర్మించడానికి కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వడం, కాంట్రాక్టర్ చేతులెత్తేసిన సందర్భంగా ఇంటి నిర్మాణాలు పూర్తికాక నివాస యోగ్యంగా లేని ఇళ్లలో నివసిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి నిత్యావసర సరుకులు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ తిరుపతమ్మ, డి.రావులమ్మ, పార్వతి, నాగమణి, లక్ష్మీబాయి, రాజీవ్ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ బ్రోచర్ ను ఆవిష్కరించిన



**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :** పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి గురువారం ఎక్సైజ్ అధికారులతో కలిసి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ బ్రోచర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన మద్యమే వినియోగదారుడికి చేరాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ సరికొత్త యాప్ను ప్రవేశపెట్టింది. దుకాణం వద్దే కొనుగోలు చేసిన మద్యం అసలుదనాన్ని వెంటనే చెక్ చేసుకునే వీలు కల్పించే ఈ యాప్ ద్వారా బాటిల్పై ఉన్న హోలోగ్రామ్ స్టిక్కర్ను స్కాన్ చేస్తే ఆ మద్యం బ్రాండ్, సైజు, ధర, తయారీ సంస్థ, ఏ డిపో నుంచి సప్లై అయ్యిందన్న వివరాలు క్షణాల్లో తెలిసిపోతాయన్నారు. ఒక వేళ **నాట్ ఫౌండ్ లేదా ఇన్వాలిడ్ స్టాక్** అని వస్తే అది నకిలీ మద్యం అని అర్థం చేసుకోవచ్చు వచ్చని తెలిపారు.ఈ వివరాలు వెంటనే ఎక్సైజ్ శాఖ దృష్టికి వెళ్తాయని, ప్రజలు తమ మొబైల్స్లో ప్లే స్టోర్ ద్వారా ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ను డౌన్లోడ్ చేసుకుని సులభంగా వాడుకోవచ్చన్నారు. ఈ యాప్ ఎక్సైజ్ శాఖలో పారదర్శకతకు నిదర్శనంగా నిలుస్తుంది అని ఎమ్మెల్యే తెలిపారు.

# భూముల రీసర్వే పనులు రైతుల సమక్షంలో చేయాలి







**నరసరావుపేట మేజర్ న్యూస్ :** పెండింగ్ భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, సర్వే అధికారులను జాయింట్ కలెక్టర్ సూరజ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రీసర్వే మూడో విడత ప్రక్రియపై మండల సర్వేయర్లతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సూరజ్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పెండింగ్ లో ఉన్న భూసంబంధిత రీసర్వేలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. భూ సమస్యలను పరిష్కరించి ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులపై అత్యంత శ్రద్ధవహించి పరిష్కరించాలన్నారు. అసైన్డ్ భూములు, ఇనాం భూములు, మ్యాటిషన్ కన్వర్షన్, సబ్ డివిజన్స్, ఎఫ్ లైన్ పిటిషన్ వ్యవసాయ భూములు మార్పులు వంటి విషయాలపై సుదీర్ఘంగా చర్చించి పలు సలహాలు అందజేసారు. రీసర్వే మూడో విడత ప్రక్రియలో భాగంలో 44 రోజుల్లో, గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేయాలన్నారు. అక్టోబర్ 3న ప్రారంభమైన మూడో విడత రీసర్వే ప్రక్రియలో ఇప్పటివరకు 25 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేసామని జిల్లా సర్వే అధికారిణి భాను కీర్తి తెలియజేసారు.

# పత్తి రైతుల రిజిస్ట్రేషన్ ప్రారంభించండి - కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా



**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** పత్తి రైతుల రిజిస్ట్రేషన్ ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా వ్యవసాయ మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. పత్తి, ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం వారిగా రైతులతో సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. ప్రాంతాల వారీగా పత్తి ఉత్పాదకత వివరాలు సమర్పించాలని ఆదేశించారు. పత్తి సేకరణలో తరచూ తలెత్తే సందేహాలను స్పష్టంగా నివృత్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై రైతులకు స్పష్టంగా అవగాహన కల్పించాలని అన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి మాట్లాడుతూ రైతుల రిజిస్ట్రేషన్ ఈ నెల 25వ తేదీ నుండి ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లాలో 94,290 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి రాగలదని అంచనా వేస్తున్నామని చెప్పారు. పొడవువైన ప్రధాన పత్తికి క్వింటాలుకు రూ.8,110, పొట్టిగా ఉన్న ప్రధాన పత్తికి క్వింటాలుకు రూ.7,710 మద్దతు ధర ఉందన్నారు. తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు ప్రాంతాల్లో ఎక్కువగా దిగుబడి వస్తుందని తెలిపారు. పౌర సరఫరా సంస్థ జిల్లా మేనేజర్ కె.తులసి ధాన్యం సేకరణ ప్రక్రియ వివరాలు తెలిపారు. పత్తి రైతుల సంఘం అధ్యక్షులు హరనాథ బాబు మాట్లాడుతూ ఒక ప్రాంతానికి మ్యాప్ అయిన మిల్లులు యాప్ లో కనిపించడం వలన ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అయితా నాగేశ్వర రావు, వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఏ.చంద్రిక, జిల్లా పౌర సరఫరాల అధికారి విజయ లక్ష్మి, రవాణా అధికారి శ్రీహరి, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ రాజేంద్ర షా, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 29 న కౌలురైతు సంఘం నాల్గవ జిల్లా మహా సభలు



**యడ్లపాడు, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన యడ్లపాడు లో జరిగే కౌలు రైతు సంఘం నాల్గవ జిల్లా మహాసభ ను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి వై.రాధా కృష్ణ పిలుపు నిచ్చారు. శుక్రవారం జరిగిన పాత్రికేయుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ గత జిల్లా మహాసభ 2022 లో సత్తెనపల్లి లో జరిగాయనీ, ఈ మూడు సంవత్సరాల లో జరిగిన కృషి ని సమీక్షించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి కౌలు రైతులకు మరింత చేరువ కావాలని వారి సమస్యల పై పనిచేస్తూ, వారందరినీ ఐక్యం చేసే కృషి లో బాగంగా, వ్యవసాయ అభివృద్ధి కోసం తీసుకోవలసిన చర్యలు లను చర్చించడం కోసం ఈ మహాసభ లు జరుగుతున్నాయనీ తెలిపారు. కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో. కూటమి ప్రభుత్వం నూతన చట్టం తీసుకొచ్చి భూ యజమాని అనుమతి అవసరం లేకుండా కార్డులు ఇస్తామని ఎన్నికల్లో కౌలు రైతులకు హామీ ఇచ్చిందని తెలిపారు. ఆ ముసాయిదా ను అసెంబ్లీ లో పెట్టి చట్టం చేయాల్సిన ప్రభుత్వం 16 నెలలు గడుస్తున్నా దాని ఊసే ఎత్తడం లేదని, వారు వ్యతిరేకించిన పాత చట్టాన్నే అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం విధానాలనే కొనసాగిస్తామని కూడా చెప్పలేదనీ తెలిపారు. కులాల తో సంబంధం లేకుండా భూమి లేని కౌలు రైతులందరికీ పెట్టుబడి సహాయం ఇస్తామని చెప్పారు కానీ ఇంత వరకూ రైతు సేవా కేంద్రం లో గానీ, సచివాలయం లో గానీ అర్హులైన కౌలు రైతుల పేర్లు కూడా ప్రకటించలేదన్నారు. రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం ఒక్కో రైతు కి పంట స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం 2 లక్షల వరకు తాకట్టు లేని రుణాలు ఇవ్వడానికి అవకాశం ఉన్నా అమలు చేయడం లేదు అని తెలిపారు. బయట మార్కెట్లో అయిన కాడికి అమ్ముకొని పెట్టిన పెట్టుబడులు రాక, అప్పుల పాలౌతున్నారన్నారు. వ్యవసాయం గిట్టుబాటు గా లేదని, ఇతర పనులు చేసుకుంటూ, ఉద్యోగాలు, వ్యాపారాలు, కాంట్రాక్టులు, కమీషన్ దారులుగా ఉంటూ వారి భూములను కౌలు కి ఇస్తున్నారు అని పేర్కొన్నారు. వీటన్నింటి పై ఈ నెల 29 జరిగే పల్నాడు జిల్లా కౌలు రైతుల సంఘం మహాసభ లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ను రూపొందించు కోవడం జరుగుతుంది అని తెలిపారు. కౌలు రైతుల సంక్షేమం కోసం జరిగే ఉద్యమం లో ప్రజలంతా సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నామన్నారు.

# రాష్ట్రస్థాయిలో జరిగిన కళా ఉత్సవ్ లో ఆలా పృద్వి మనోజ్ కుమార్ ప్రథమ స్థానం



**గుంటూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్ :** రాష్ట్రస్థాయిలో జరిగిన కళా ఉత్సవ్ - 23వ, 24వ తేదీలలో పోటీలు విజయవాడలోని మురళి రిసార్ట్స్ లో వైభవంగా జరిగాయి. దీనిలో గెలుపొందిన విద్యార్థులకు స్కీర్ట్ డైరెక్టర్ కృష్ణారెడ్డి బహుమతులను ప్రధానం చేసిరి. దీనిలో ముఖ్యంగా ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి సోలో క్లాసికల్ మ్యూజిక్ లో ఆలా పృద్వి మనోజ్ కుమార్, హిందూ కాలేజీ, గుంటూరు కు ప్రథమ స్థానంలో గెలుపొందాడు అలాగే ఏ. హృతిక శ్రీ వెంకటేశ్వర బాల కు టిర్, గుంటూరు, విద్యార్థినికీ క్లాసికల్ సోలో డాన్స్ లో ప్రథమ స్థానం సాధించింది అలాగే వేల్పూరు జడ్పీ.హెచ్.ఎస్, పల్నాడు జిల్లా పాఠశాలకు చెందిన విద్యార్థులు థియేటర్లో రెండో స్థానాన్ని సాధించారు. మొదటి స్థానం సాధించిన వారు జాతీయ స్థాయికి పంపబడతారు. గుంటూరు జిల్లా డీఈఓ న రేణుక పల్నాడు జిల్లా డీఈఓ చంద్రకళ అభినందించారు. దీనికి ప్రోత్సహించిన నోడల్ ఆఫీసర్ డైట్ లెక్చరర్ డాక్టర్ విమల కుమారిని, వారి గైడ్ ఉపాధ్యాయులను అందరూ అభినందించిరి. జాతీయ స్థాయిలో కూడా ప్రథమ స్థానం లో రావాలని అన్నారు.

# 30 వరకు ఉచిత ఆధార్ అప్డేట్ కార్యక్రమం



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పాఠశాలకు విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థిని విద్యార్థులకు ఈనెల 30వ తేదీ వరకు ఉచిత ఆధార్ అప్డేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాబట్టి రాష్ట్రంలోని అందరు మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తమ తమ పరిధిలోని విద్యార్థిని, విద్యార్థులకు ఆధార్ అప్డేషన్ పూర్తి చేయించాలని స్టేట్ నోడల్ పర్సన్ చెరుకూరి రమేష్ తెలిపారు ఈరోజు కాకాని మండలం వెనిగండ్ల లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఆధార్ క్యాంప్ కేంద్రాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా కాకాని మండలంలో 300 మంది విద్యార్థులకు అప్డేషన్ చేయవలసిన అవసరం ఉన్నదని తప్పక అన్ని పూర్తి చేయాలని కేంద్ర నిర్వాహకులను కోరారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నంబూరి తిరుపతిరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# హెలిపాడ్ ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో మురళి



**వెల్దుర్తి మేజర్ న్యూస్ :** వెల్దుర్తిలో బరిసరంగా జరుగనున్న ప్రముఖ కార్యక్రమం నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈనెల 27న మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పెద్ద కుమారుడు జూలకంటి గౌతమ్ రెడ్డి - తేజస్వినీల వివాహ రిసెప్షన్ వేడుక వెల్దుర్తిలో ఘనంగా జరగనుంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానుండటంతో, సంబంధిత అధికారులు భద్రతా, రవాణా ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో మురళి శుక్రవారం హెలిపాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. వెల్దుర్తికి సమీపంలో హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం ప్రత్యేక హెలిపాడ్ నిర్మాణం జరుగుతున్నట్లు సమాచారం. ఈ పరిశీలన కార్యక్రమంలో మాచర్ల ఎమ్మార్వో కిరణ్ కుమార్, వెల్దుర్తి ఎంపీడీవో ప్రసాద్, ఆర్ అండ్ బి అధికారులు, అలాగే టిడిపి నాయకులు హనిమిరెడ్డి, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు. అధికారులు అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేసేలా సూచనలు జారీ చేశారు.

# జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన కలెక్టర్



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** జ్యూడిషల్ అకాడమీ డైరెక్టర్ చింతలపూడి పురుషోత్తం కుమార్ ను జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరి మండలం కాజా వద్ద ఉన్న ఏపీ జ్యుడీషియల్ అకాడమీలో శుక్రవారం డైరెక్టర్ ను కలిసి పుష్ప గుచ్చాలు అందించారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, ఏంటీఎంసీ కమిషనర్ ఆలిం భాష పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లోని లబ్ధిదారులు పీఎంఏవై గ్రామీణ పథకమును వినియోగించుకోవాలి

**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** దుగ్గిరాల మండల గ్రామాల్లోని లబ్ధిదారులు సొంత స్థలం కలిగి ఉండి పీఎంఏవై గ్రామీణ టు జీరో పథకం కింద గృహములు మంజూరు చేసే అవకాశం ఉన్నందున. లబ్ధిదారులు వినియోగించుకోవాలని ఎంపీడీవో ఏ.శ్రీనివాసరావు తెలియజేశారు. లబ్ధిదారులు గృహ మంజూరు కొరకు సొంత స్థలమునకు సంబంధించి దస్తావేజు లేక పొజిషన్ సర్టిఫికెట్స్. కుల మరియు ఆదాయ ధ్రువీకరణ పత్రము, రేషన్ కార్డు, ఆధార్ జిరాక్స్ లబ్ధిదారుని ఫోటో, ఉపాధి హామీ పథకం కార్డుతో సచివాలయం లో సంప్రదించి గృహ మంజూరు కొరకు ఆవాస్ ప్లస్ యాప్ లో రిజిస్టర్ చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

# పత్తి కొనుగోలు నిబంధనలపై రైతులకు అవగాహన కల్పించండి



**పల్నాడు జిల్లా మేజర్ న్యూస్ :** జిల్లాలో పత్తి కొనుగోళ్ల నిబంధనలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల వరకూ వెళ్లక ముందే ఆమోదయోగ్యమైన తేమ శాతం గురించి రైతులకు తెలియజేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల వద్దే తేమ శాతం చూసి కొనుగోలు కేంద్రాల వరకూ పంటను తీసుకువెళ్లాలా, లేదా అనే విషయంపై రైతులకు స్పష్టత ఇవ్వాలన్నారు.స్థానిక కలెక్టరేట్ లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో పత్తి కొనుగోళ్ల ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వారం వారం జిల్లాలో మండలాల వారీగా పత్తి ఉత్పత్తి అంచనా వివరాలు సీసీఐకి అందించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. తేమ మీటర్లు అన్ని మార్కెట్ కమిటీల్లో అందుబాటులో ఉంచాలన్నారు. లీగల్ మెట్రాలజీ అధికారులు తేమ మీటర్లను పరీక్షించిన తర్వాతే ఉపయోగించాలన్నారు. హెక్టారుకు 15 క్వింటాళ్ల వరకూ పంట కొనుగోలు చేయనున్నామని సీసీఐ అధికారులు తెలియజేశారు. కాపస్ కిసాన్ యాప్, సీఎం యాప్ లలో గ్రామ వ్యవసాయ సహాయకులు చేపట్టే రిజిస్ట్రేషన్ ఆధారంగా కొనుగోళ్లు చేస్తామన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలోనే రైతులు కోరుకున్న తేదీలో కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్లే వెసులుబాటు కల్పించనున్నామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, జిల్లా మార్కెటింగ్ అధికారి ఉపేంద్ర కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు, సీసీఐ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ కు ప్రతిపాదనలు



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ కు ప్రతిపాదనలు సమర్పించడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ మినీ సమావేశమందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు 1200 ఓటర్లు కంటే అధికంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను రేషనలైజేషన్ చేసి అక్టోబర్ 27 నాటికి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి ప్రతిపాదనలు అందించాల్సి ఉందన్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ బూత్ లలో 1200 మంది ఓటర్లు ఉండేలా అదనంగా ఉన్న ఓటర్లను సమీపంలోని పోలింగ్ బూత్ లలో సర్దుబాటు, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటును ప్రాథమికంగా పూర్తి చేయటం జరిగిందన్నారు. మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏ ఈ ఆర్ వో లు సమావేశం నిర్వహించి పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రతిపాదన పై చర్చించి అభిప్రాయాలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి అమోదం కోసం ఎన్నికల సంఘంకు రేషనలైజేషన్ ప్రతిపాదనలు పంపటం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికే 2002 నుంచి 2025 వరకు ఉన్న ఓటరు జాబితాలను పరిశీలించి నివేదికను ఎన్నికల సంఘంకు అందించడం జరిగిందన్నారు. ఓటర్ నమోదు, తొలగింపుకు సంబంధించిన దరఖాస్తులను పెండింగ్ తదితర అంశాలను వివరించారు. పోలింగ్ కేంద్రాల వారీగా బూత్ లెవల్ ఏజెంట్ లను నియమించుకొని వివరాలను అందించాలని రాజకీయపార్టీల ప్రతినిధులకు సూచించారు. ఈ సమావేశంలో అమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి డా. టి సేవా కుమార్, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి చిరతనగండ్ల వాసు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి వైవీ సుబ్బారావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బి.సునీల్ కుమార్, తెలుగుదేశం పార్టీ నుంచి కె శివరామయ్య, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి కే ప్రేమ్ కుమార్, జనసేన పార్టీ ప్రతినిధి సీహెచ్ త్రినాధ్, ఈఆర్వోలు, విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజరు లక్ష్మీకుమారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనరు చల్లా ఓటులేసు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి, ఏ ఈ ఆర్ వో లు తహసిల్దార్లు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ ను తనిఖీ చేసిన కలెక్టర్



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) గోడౌన్ ను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా శుక్రవారం తనిఖీ చేశారు. పీరియాడికల్ తనిఖీలలో భాగంగా ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, విపత్తులు అగ్నిమాపక శాఖ అధికారి, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సురక్ష యాప్ తో కల్తీ మద్యం కు చెక్



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్ :** గుంటూరు రూరల్ మండలం లో శీను వైన్ మార్ట్ అక్రమ, కల్తి మద్యం వినియోగాన్ని అరికట్టేందుకు, ప్రజ భాగ్యస్వామ్యాన్ని పెంచే లక్ష్యంతో, ఏపీ ఎక్సేంజ్ సురక్ష మొబైల్ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని ప్రత్తిపాడు శాసనసభ్యులు బి.రామాంజనేయులు పాల్గొన్నారు. మద్యం సిసాపై ఉండే క్యూ ఆర్ కోడ్ ను వినియోగదారులు తప్పనిసరిగా ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ లో స్కాన్ చేసి, మద్యం నాణ్యతను తనిఖీ చేసుకోవాలని కోరారు. తద్వారా కల్తి, మద్యాన్ని గుర్తించడం, అక్రమ మద్యం అమ్మకాలను అరికట్టడం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రభుత్వానికి ప్రజా ఆరోగ్యం ప్రజా ఆరోగ్యం ముఖ్యమని తెలియజేశారు. సురక్ష యాప్ ఏర్పాటు చేసినందుకు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

## 31న నగరంలో భారీ స్థాయిలో ఏక్తా యాత్ర



**గుంటూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో వాజపాయ్ భవన్లో జిల్లా పదాధికారులు సమావేశం జరిగింది. రాబోయే పలు రకాల కార్యక్రమాలు సంస్థాగత విషయాలు, చర్చించు కోవడం జరిగినది ముఖ్యంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఈనెల 31వ తేదీ భారీ సంఖ్యలో ఏక్తా యాత్ర చేయు సందర్భంగా ఏర్పాట్లు గురించి ఈ ఏక్తాయాత్రలో ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేలు ఎంపీలు జిల్లా స్థాయి నాయకులు కార్యకర్తలు పలు ప్రభుత్వ అధికారులు పాల్గొని విధంగా చూడాలని చర్చించుకోవడం ఇంకా జిల్లాలో మండల కేంద్రాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమం చేసే విషయం అనేక విషయాలు ప్రస్తావించుకోవడం జరిగినది. తరువాత ఈరోజు కర్నూలు దగ్గర జరిగిన బస్సు దుర్ఘటన కు శ్రద్ధాంజలి ఘటించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు దేసు సత్యనారాయణ తోట శ్రీనివాసరావు భజరంగ్ రామకృష్ణ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీని వాస్ మీడియా ప్యానలిస్ట్ తాడు వాయి రామకృష్ణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ దర శ్రీనివాసరెడ్డి ఉపాధ్యక్షులు సాధు రామకృష్ణ మంత్రి సుగుణ వంగిపురం విమలాదేవి కత్తి మేరీ సరోజినీ కార్యదర్శి శివయ్య సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమం కన్వీనర్ పాండురంగా విటల్ జిల్లా ఇన్చార్జిలు గాజుల వెంకయ్య నాయుడు కొక్కెర శ్రీనివాస్ సోషల్ మీడియా తూనుగుంట్ల రాజేష్ మాజీ ప్రధాన కార్యదర్శులు చరకా కుమార్ గౌడ్ వై వి సుబ్బారావు మండల కార్యకర్తలు అబ్రహం మొదలగువారు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేసినారు.

## కపాస్ కిసాన్ యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవాలి

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సి.సి.ఐ) జనరల్ మేనేజర్ రాజేంద్ర షా కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2025-26 పంట సంవత్సరంలో సి.సి.ఐకు మద్దతు ధర (ఎంఎస్పీ)తో పత్తి విక్రయాలకు **"కపాస్ కిసాన్"** మొబైల్ యాప్ లో నమోదు కావాలన్నారు. ఈ మొబైల్ యాప్ ను గూగుల్ ప్లే స్టోర్, ఆపిల్ ఐ.ఓ.ఎస్ స్టోర్లో డౌన్లోడ్ చేసుకోవచ్చని చెప్పారు, డౌన్లోడ్ చేసుకున్న రైతులు మొబైల్ ఫోన్ నంబరుకు వచ్చే ఓ.టి.పి ద్వారా లాగిన్ కావాలని పేర్కొన్నారు. మద్దతు ధరకు విక్రయానికి యాప్ లో స్లాట్ బుక్ చేసుకోవాలని ఆయన సూచించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా పత్తి రైతుల ప్రయోజనాల కోసం, కనీస మద్దతు ధర పథకం క్రింద ప్రయోజనాలను పొందడానికి పత్తి రైతులు అందరు మొబైల్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వైద్యశాల పరికరాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా సామాజిక ఆరోగ్య కేంద్రం, మాచర్లకు సి.ఎస్.ఆర్. నిధుల ద్వారా కొనుగోలు చేయవలసిన ఆసుపత్రి పరికరాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎ.పి.ఎం.ఎస్.ఐ.డి.సి. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ మరియు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఎ.పి.ఎం.ఎస్.ఐ.డి.సి. వద్ద ఇప్పటికే సిద్ధంగా ఉన్న పరికరాలను వారి ద్వారా సమకూర్చి, మిగిలిన అవసరమైన పరికరాలను జిల్లా పర్చేస్ కమిటీ ద్వారా కొనుగోలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలియ జేశారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తన కార్యాలయము నుండి వీడియో కాన్ఫరెన్స్ లో ఏ.పీ.డి.ఎం.ఐ.ఎస్ ప్రతినిధులు శ్రీకాంత్, కలెక్టరేట్ నుండి సిపిఓ మాలతి, కృష్ణ కిషోర్, ఏపీ డి.ఎం.ఎస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# లాడ్జిలో ఆత్మహత్యాయత్నం... కాపాడిన త్రీ టౌన్ సీఐ

## లాడ్జ్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి...



**తెనాలి, మేజర్ న్యూస్ :** లాడ్జిలో ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని తెనాలి త్రీ టౌన్ సీఐ సాంబశివరావు కాపాడారు. స్థానిక త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘటన వివరాలను డీఎస్పీ బి జనార్దనరావు విలేకరులకు వెల్లడించారు. రేపల్లె మండలం సింగుపాలెంకు చెందిన గవల్లపల్లి మహేశ్వరరావు పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ లాడ్జిలో గురువారం రాత్రి పురుగులు మందు, గుళికలు సేవించి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. త్రీ టౌన్ సిఐ సాంబశివరావు లాడ్జిల తనిఖీల్లో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మహేశ్వరరావు హైదరాబాదు లోని నిజాంపేటలో ఉంటున్నాడు. తాను పనిచేస్తున్న చిట్ ఫండ్ కంపెనీ దివాలా తీయడం ఆ ఒత్తిడి తనమీద పడడంతో తెనాలి వచ్చారు. తెనాలిలో లాడ్జిలో పురుగుల మందు తాగి హత్మహత్యకు సిద్ధమైన సమయంలో త్రీ టౌన్ సీఐగుర్తించారు. మహేశ్వరరావును చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలింఛీ కుటుంబ సభ్యులను పిలిపించారు. వ్యక్తి ప్రాణాలు కాపాడిన సీఐ సాంబశివరావు, ఎస్ఐ, పోలీసులను డీఎస్పీ అభినందించారు. త్రీ టౌన్ పరిధిలోని లాడ్జీలు, డార్మెటరీ యజమానులతో డీఎస్పీ జనార్దనరావు శుక్రవారం సమావేశం నిర్వహించారు. స్థానిక త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన సమావేశంలో లాడ్జిల యజమానులు గుర్తింపు కార్డులు ఉన్నవారికే గదులు ఇవ్వాలని సూచించారు. లాడ్జిలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రికార్డులు సరిగా నిర్వహించాలన్నారు. పేకాట ల్, వ్యభిచార కార్యకలాపాలు జరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. మైనర్లు, విద్యార్థులకు లాడ్జీలలో గదులు ఇవ్వరాదన్నారు. ఫోక్సో కేసులు, గ్యాంగ్ రేప్ వంటి వాటికి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన హెచ్చరించారు. సమావేశంలో సీఐ సాంబశివరావు, ఎస్ఐ కరీముల్లా సిబ్బంది ఉన్నారు.

## అన్ని మండల కేంద్రాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** జిల్లాలో అన్ని మండల మార్కెట్ యార్డులోనే కొనుగోలు కేంద్రాల వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్, కౌలు రైతులు సంఘం జిల్లా అధ్యక్షులు బొట్ల రామకృష్ణ, రైతు సంఘం జిల్లా నాయకులు బిక్కి శ్రీనివాసరావు బృందం శుక్రవారం గుంటూరు లోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ రాజేంద్ర షా కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రతి మండల కేంద్రాలోని మార్కెట్ యార్డులోనే కొనసాగించాలని కోరారు.ప్రతి కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం 8110 రూపాయలు తగ్గకుండా కొనుగోలు చేసి ఆడుకోవాలని కోరారు. సి సి ఐ విజిలెన్స్ పర్యవేక్షణ నిరంతరం ఉండాలని విజ్ఞప్తి చేశారు.అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న పత్తి కొనుగోలుదారులు,జిన్నింగ్ మిల్లు లపై కఠిన చర్యలు తీసుకుంటేనే రైతులకు న్యాయం జరుగుతుంది అన్నారు. ఈ క్రాప్ ఆధారంగా కౌలు రైతుల పత్తి ని కూడా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ఈ డిమాండ్ల సాధనకై సిసిఐ సెంట్రల్ ఆఫీస్ నుంచి నిరంతరం పర్యవేక్షణలు జరగాలన్నారు. గత ఏడాది మాదిరిగా పత్తి రైతులకు నష్టం కలిగించకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞాపన పత్రంలో కోరినట్లు వారి వెల్లడించారు.

# రైతులు పంటల రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి – జేడి అయితా నాగేశ్వర రావు



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** భారీ వర్షాలకు రైతులు పంటల రక్షణకు కొన్ని జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అయితా నాగేశ్వర రావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో అల్పపీడనం వల్ల కురుస్తున్న అధిక వర్షాలకు వివిధ పంటల్లో క్రింద సూచించిన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాలలో పొలం నుండి మురుగు నీటిని తొలగించాలన్నారు. రాబోవు రెండు రోజులలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట పొలాల్లో మందులను పిచికారి చేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలన్నారు. దుబ్బు చేసే దశలో వున్న పంటలో బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు ఆశించే అవకాశం ఉందని, రైతులు 0.2 గ్రాములు ప్లాంటమైసిన్ మందును లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని చెప్పారు. నత్రజని ఎరువును మోతాదుకు మించి ఉపయోగించకూడదని లేదా రెండవ దఫా ఎరువును వేసుకోవడం వాయిదా వేసుకోవాలని తెలిపారు. కాండం కుళ్ళు రావడానికి కూడా అవకాశం ఎక్కువగా ఉందన్నా రు. 2.5 గ్రా. కార్బెండజిమ్, మ్యాంకోజెబ్ శిలీంద్రనాశక మందును లేదా 1 మి.లీ వాలిడామైసిన్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అగ్గి తె గులు కూడా రావడాని కి అవకాశం ఎక్కువగా ఉ ందని, తెగులును గమని ంచినట్లయితే 0.6 గ్రాముల ట్రై సైక్లోజోల్ మం దును లీటర్ నీటిలో కలి పి పిచికారి చేయాలని పేర్కొన్నారు. ప్రత్తికి ప్రస్తుత ం కురుస్తున్న వర్షాలు తగ్గిన తరువాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ రసాయనిక ఎరువులను పైపాటుగా పంటకు మొక్కల మొదళ్ళలో 7-10 సెం. మీ దూరంలో పాదులుతీసి రసాయనిక ఎరువులను వేసి మట్టితో కప్పాలని సూచించారు. ముంపుకు గురైన పంట త్వరగా కోలుకోవడానికి 19:19:19 లేదా 13-0-45 లేదా 10 గ్రా. యూరియా లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. పిండి నల్లి రావడానికి అవకాశం ఎక్కువగా ఉందని, ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా రెండు మిల్లీలీటర్ల ఫిప్రోనిల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని, నేల ద్వారా వ్యాప్తి చెందే ఎండు తెగులు నివారించుటకు 3 గ్రా. కాపర్-ఆక్సి-క్లోరైడ్ లేదా ఆల్టర్నేరియా ఆకు మచ్చ తెగులు కొరకు 2. 5 గ్రా. కార్బెండజిమ్, మ్యాంకోజెబ్ శిలీంద్రనాశక మందును లీటరు నీటిలో కలిపి నేల బాగా తడిచేటట్టు వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలన్నారు. వర్షం ఆగిన తరువాత లేత పైరులో సాయంత్రం వేళలో ఒక ఎకరానికి 15 కేజీల యూరియా, 10 కేజి ల పొటాష్ వేయాలన్నారు. జింక్, ఇనుము లోపాలు (ముఖ్య ముగా నల్ల నేలల్లో) అధిక వర్షాల కారణముగా సంభవించే అవకాశం ఉందని, వర్షాలు ఆగిపోయి న తరువాత సూక్ష్మ పోషకాలను అందించాలన్నా రు. పెసర పంట పొలములో ఉన్న మురుగు నీరు ఎప్పటికప్పుడు తీసివేయాలని. వర్షం ఆగిన తరువాత లేత పైరులో సాయంత్రం వేళలో ఒక ఎకరానికి 15 కేజీల యూరియా, 10 కేజి ల పొటాష్ వేయాలని పేర్కొన్నారు. రాత్రి ఉష్ణోగ్రత తగ్గి మంచు పడటం వలన పెసరలో బూడిద తెగు లు ఆశించవచ్చని, రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీని నివారణకు హెక్సాకొనజోల్ 2.మి.లి. లేదా ప్రోపికొనజోల్ 1 మి.లి. లేదా కార్బడిజం 1 గ్రాము 1 లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని చెప్పారు.



## మిరపలో సస్యరక్షణ చర్యలు

**పెదకూరపాడు మేజర్ న్యూస్:** మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పెదకూరపాడు జోన్ ఉద్యానవన శాఖ అధికారి సురేష్ కోరారు. శుక్రవారం ఆయన మిరప పొలాలను పరిశీలించారు. అధిక వర్షాల వల్ల మిరప మొక్కలు వడబడి తలలు వాలినట్లుగా కనపడితే లీటర్ నీటికి ఐదు గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ మరియు 19:19:19 ఐదు గ్రాములు లీటర్ నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేయాలన్నారు. ఎండు తెగులు సోకకుండా రీడోమిల్ గోల్డ్ అనే తెగులు మందులు లీటర్ నీటికి రెండు గ్రాములు చొప్పున కలుపుకొని మొదలు తడిచే విధంగా పిచికారి చేస్తే ఫలితం ఉంటుందన్నారు. వేరు కుళ్ళు ఆశించకుండా ఒక లీటర్ నీటికి కాపర్ ఆక్సిక్లోరైడ్ తెగులు మందుని మూడు గ్రాములు ఒక లీటర్ నీటికి మరియు ప్లాంటోమైసిన్ 50 గ్రాములు 200 లీటర్ల నీటికి చొప్పున కలుపుకొని మొదలు తడిచే విధంగా పిచికారి చేసుకోవాలని సూచించారు. ఆకుమచ్చ తెగులు ఆశించకుండా ప్రాపికోనజోల్ తెగులు మందును 1 మీ.లీ లీటర్ నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేయటం మంచి మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి వీహెచ్ఏ బాజీ, మిరప రైతులు పాల్గొన్నారు.

# వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు మద్దతు పలకాలి



**పెదకాకాని మేజర్ న్యూస్ :** ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తుందని, దీన్ని అడ్డుకునేందుకు ప్రతి ఒక్క వర్గం ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైకాపా పెదకాకాని మండల అధ్యక్షులు మూడియాల మల్లికార్జునరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నటువంటి మెడికల్ కళాశాలలను ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రైవేటీకరణ చేస్తూ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. జగన్మోహనరెడ్డి పిలుపు మేరకు గ్రామాల్లో ప్రతి గడపగడపకు తిరిగి మెడికల్ కాలేజిల ప్రైవేటీకరణపై నిరసనగా సంతకాలు సేకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ అయినట్లయితే అన్ని వర్గాలకు నష్టం జరుగుతుందన్నారు. వైద్య విద్య పేదవారికి దూరమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ సారధ్యంలో అంబేద్కర్ నగర్లో సంతకాల సేకరణ చేయడం జరిగింది. ఈ సంతకాల సేకరణలో గ్రామంలోని ప్రజలు ఎంతో ఉత్సాహంతో సంతకాలు చేయడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు తాడిపోయిన వేణుగోపాల్ పెదకాకాని గ్రామ పార్టీ అధ్యక్షులు సుంకర కృష్ణారెడ్డి , మండల బూత్ కమిటీ అధ్యక్షులు సుంకర నర్సిరెడ్డి , వైసిపి నాయకులు మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మురికిపూడి చంద్రశేఖర్, వార్డ్ మెంబర్ మురికిపూడి శేఖర్, పెదకాకాని మండలం అంగన్వాడి అధ్యక్షురాలు బంక జయ మేరీ , భాను, జోసఫ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకముగా కోటి సంతకాల సేకరణ

**వినుకొండ మేజర్ న్యూస్:** నియోజకవర్గం: పల్నాడు జిల్లా వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పిలుపు మేరకు రచ్చబండ కార్యక్రమం జరిగింది. మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటిసంతకాల సేకరణ లో వినుకొండ పట్టణం వైకాపా కన్వీనర్ మరియు అన్ని అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు వైకాపా ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొనడం జరిగింది.

# వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం

● పేద వర్గాలకు వైద్య విద్యను వైద్యాన్ని దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం
● ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ ● డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి



**సత్తెనపల్లి ,మేజర్ న్యూస్:** చంద్రబాబు నాయుడు మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తూ పేదవాడికి వైద్య విద్యను, వైద్యాన్ని దూరం చేస్తున్నారని ,ఈ ప్రైవేటీకరణను వైఎస్ఆర్సిపి వ్యతిరేకిస్తుందని వైయస్సార్సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా " ప్రజా ఉద్యమ పోస్టర్" ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రైవేటీకరణ ఆపేంతవరకు పేదల తరఫున జగనన్న ఆధ్వర్యంలో పోరాడతామని తెలియజేశారు. ప్రతి జిల్లా కి ఒక మెడికల్ కాలేజీ ఉండాలని జగనన్న సంకల్పంతో 17 మెడికల్ కాలేజీలకు పర్మిషన్ తీసుకువచ్చి 7 మెడికల్ కాలేజీలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందనారు. 4 మెడికల్ కాలేజీలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, 6 కాలేజీలు వివిధ దశలో ఉన్నాయని వీటికి 5వేల కోట్లు ఖర్చు పెడితే అందుబాటులోకి వస్తాయన్నారు. తద్వారా ప్రతి జిల్లాకి ఒక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అందుబాటులోకి వస్తుందని ప్రతి పేదవాడికి వైద్య విద్య, వైద్యం చేరువవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల గ్రామ, వార్డు పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.